క్లుప్తంగా...

ముదిరాజ్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

మేడ్చల్: ముదిరాజ్‌ల ఆత్మగౌరవం కోసం ఆదివారం నగరంలో నిర్వహిస్తున్న ముదిరాజ్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్, మెదక్ జిల్లా రంగాయిపల్లి సర్పంచ్ నాగభూషణం కోరారు. ముదిరాజ్‌లు పార్టీలకు అతీతంగా సభకు హాజరుకావాలని కోరారు. ముదిరాజ్‌లను అన్ని పార్టీలు రాజకీయంగా వాడుకుంటున్నాయని అన్నారు. చట్ట సభల్లో ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం కోసం చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

రైల్వే వంతెన పనులు ప్రారంభం



రైల్వే వంతెన పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన రెండో వైపు పనులు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్లు శశికళ, రవీందర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు, నరేశ్‌గౌడ్, విజయ్, రాందాస్, ఫయామ్, విజయ్, సురేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ కానిస్టేబుల్‌గా ప్రదీప్



మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రదీప్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. తన విధి నిర్వహణలో సక్రమంగా బాధ్యతలను నిర్వర్తిస్తుండటంతో ఆయనను సంస్థ యాజమాన్యం ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కానిస్టేబుల్ ప్రదీప్‌ను సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు.

రక్తదానం చేసిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు




మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం రక్తదానం చేశారు. సీఎంఆర్ ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని చైర్మన్ గోపాల్‌రెడ్డి ప్రారంభించగా విద్యార్థులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ అలీబేగ్, కళాశాల డైరెక్టర్ రాజిరెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బస్వరాజ్



ఘట్‌కేసర్: తెలంగాణ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా కాచివానిసింగారం ప్రాంతానికి చెందిన బస్వరాజ్‌గౌడ్ ఎంపికయ్యాడు. రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌రాజు ఎంపిక చేయగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ ఆయనకు నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు బీజేపీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

ఎమ్మార్‌సీఈలో వర్క్‌షాప్



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. కోడింగ్ నింజాస్ సహకారంతో చేపట్టిన వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ ప్రారంభించారు. మైక్రోసాఫ్ట్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాక్షి శర్మ కంప్యూటర్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలను వివరించారు. డీన్ నర్సింహారెడ్డి, రాజేశ్వరన్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసమ్మతి జ్వాల

- మేడ్చల్, దమ్మాయిగూడ చైర్మన్లపై అవిశ్వాసం నోటీసు
- జవహర్‌నగర్ మేయర్‌ను మర్చాలని కార్పొరేటర్ల నోటీసు
- గ్రూపులుగా అధికార పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు
- అవిశ్వాసాలు ఆపాలని కోర్టును ఆశ్రయించిన వైనం..
- పిటిషన్లను కొట్టివేసిన కోర్టు
- దీంతో అసమ్మతి నేతల్లో చిగురించిన ఆశలు





మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

మేడ్చల్: స్వపక్షంలో విపక్ష నేతలుగా మారి గ్రూపులు కట్టి అధిష్టానం నియమించిన మున్సిపల్ చైర్మన్లను గద్దెదించాలని ప్రయత్నాలు చేసిన అసమ్మతి నాయకుల ఆశలను హైకోర్టు సజీవం చేసింది. గతంలో మున్సిపాలిటీల్లో చైర్మన్లను గద్దె దించాలని అధిష్టానం, మంత్రి మల్లారెడ్డికి అల్టిమేటం జారీ చేసి నోటీసులు ఇచ్చినా అసమ్మతి కౌన్సిలర్లకు కోర్టు రూపంలో అడ్డు తగిలింది. అవిశ్వాసాలు ఆపాలన్న పిటిషన్లను తాజాగా హైకోర్టు కొట్టివేయడంతో అసమ్మతి నేతల్లో మరోసారి పదవిపై ఆశలు చిగురించాయి.

పిటిషన్లను కోర్టు కొట్టివేయడంతో..

మేడ్చల్ నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉండగా అన్నింట్లో అధికార బీఆర్‌ఎస్ నేతలే మేయర్లు, చైర్మన్లుగా ఉన్నారు. మేడ్చల్, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లను గద్దెదించాలని, జవహర్‌నగర్ మేయర్ పదవిని వేరొకరికి ఇవ్వాలని ఫిబ్రవరి నెలలో మెజారిటీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మంత్రి మల్లారెడ్డిని కోరినా ఆయన ససేమిరా అనడంతో కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాసం నోటీసులు అందజేశారు. మేడ్చల్ దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లపై, జవహర్‌నగర్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టారు. ఆ తర్వాత అవిశాస్వం ఆపాలని నేతలు కోర్టును ఆశ్రయించగా కోర్టు శుక్రవారం పిటిషన్లను కొట్టివేయడంతో తిరిగి అసమ్మతి జ్వాల రగులుకుంటోంది. ఒక్కో మున్సిపాలిటీలో మెజారిటీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఒకవర్గంగా, పదవిలో ఉన్న వారు మరో వర్గంగా చీలిపోయారు. ఇన్నాళ్లు ఈ విషయం కోర్టులో ఉండటంతో అసమ్మతి ఉన్నా సర్దుకుని పోయారు.

మంత్రికి కత్తిమీద సామె..

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు రానుండటం, పట్టణాల్లో మెజారిటీ కౌన్సిలర్లు చైర్మన్లను పదవి నుంచి తప్పించాలని పట్టుబట్టడం మంత్రి మల్లారెడ్డికి కత్తిమీద సాములా మారింది. చైర్మన్లను కొనసాగిస్తే మెజారిటీ కౌన్సిలర్లు పార్టీకి దూరం అవుతారేమోనని, కౌన్సిలర్ల మాట వింటే మరోవర్గానికి దూరం తప్పదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు తనకు ఎన్నికలు, మరోవైపు మల్కాజిగిరి బరిలో అల్లుడు పోటీ చేయనుండటం, తాజాగా మున్సిపల్ అవిశ్వాసాలు తెరపైకి రావడంతో మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ రాజకీయం పెద్ద భారంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలు మంత్రికి అవసరం కావడంతో కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మంత్రి మల్లారెడ్డి విజయం కోసం పని చేయాలంటే తమకు, తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలనే మెళిక పెట్టడానికి వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. కింది స్థాయి నాయకులు సైతం తమ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని పదవుల్లో ఉన్న వారిని మార్చాలని పట్టుబడుతున్నారు. ఆరు నెలల క్రితమే మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ అసమ్మతి తారాస్థాయిలో ఉండి నాయకులు బజారున పడ్డారు. విషయం కోర్టుకు వెళ్లడంతో ఉపశమనం కలిగినా తాజా పరిస్థితిలో మరోసారి అసమ్మతికి ఆజ్యం పోసినట్లయ్యింది.

రెండు మూడు మినహా..

మేడ్చల్ నియోజకవర్గంలోని రెండు మూడు మున్సిపాలిటీలు మినహా అన్నింటిలో అసమ్మతి కనిపిస్తోంది. నాగారం, పోచారం మినహా అన్ని మున్సిపాలిటీల్లో అసమ్మతి ఉండగా అదను కోసం నాయకులు ఎదురుచూస్తున్నారు. జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడలో అసమ్మతి ఉండగా జవహర్‌నగర్‌లో ఇప్పటికే అసమ్మతి నోటీసు ఇచ్చారు. మేడ్చల్, దమ్మాయిగూడ, చైర్మన్లపై అవిశ్వాసం నోటీసులు ఇవ్వగా మిగతా వాటిలో యత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో అన్నింటిలో నాయకులు అసమ్మతి బావుట ఎగురవేసినా మంత్రి మల్లారెడ్డి ఎప్పటికప్పుడు చల్లార్చినా అవి ఇప్పుడు రాజుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తమకు నచ్చని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న చైర్మన్లపై అవిశ్వాసం పెట్టినా.. పెట్టకపోయినా పదవుల నుంచి మార్చాల్సిందేనని నాయకులు పట్టుబడుతున్నారు. చాలా మున్సిపాలిటీల్లో అసమ్మతి కౌన్సిలర్లు, చైర్మన్ వర్గంగా రెండు వర్గాలు బీఆర్‌ఎస్‌లో ఉన్నాయి. పదవులు లేని నాయకులు రెండు వర్గాల్లో ఉంటూ రాజకీయం నడిపిస్తున్నారు. మొత్తం మీద మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో హైకోర్టు తీర్పు అసమ్మతిని రాజేసింది.

కాంగ్రెస్‌కు కలిసి రాని డీసీసీ



మేడ్చల్: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆ పార్టీ నాయకులకు కలిసి రావడం లేదు. నూతన జిల్లాగా మేడ్చల్ ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఎవరు చేపట్టినా వారు పార్టీ మారుతున్నారు. మేడ్చల్ జిల్లా మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఐదు నియోజకవర్గాలతో మేడ్చల్ జిల్లాగా ఉండగా జిల్లా అధ్యక్ష పదవి చేపట్టిన నాయకులు ఆ పార్టీలోనే ఉండటం లేదు. జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారి డీసీసీ అధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ నియమితులయ్యారు. పార్టీ కోసం ఆయన బాగానే పనిచేసినా కాంగ్రెస్‌లో భవిష్యత్ లేదని నాలుగేళ్ల క్రితం బీజేపీలో చేరారు.

రాహుల్ గాంధీ సముదాయించినా..

కూన శ్రీశైలంగౌడ్ పార్టీలో నుంచి వెళ్లగానే ఆయన స్థానంలో పీసీసీ మల్కాజిగిరి అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్‌ను నియమించింది. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్‌లోనే ఉండి రాబోయే ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆశించినా మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో శ్రీధర్ కాంగ్రెస్ అలకబూనారు. నందికంటి శ్రీధర్‌ను రాహుల్ గాంధీ సముదాయించినా కాంగ్రెస్‌లో తనకు భవిష్యత్ లేదని బుధవారం ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. తనకు మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్ రాదనే ఉద్దేశ్యంతో ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇప్పటి వరకు ఇద్దరు నేతలు జిల్లా అధ్యక్ష పదవి చేపట్టి ఇద్దరు నేతలు పార్టీకి దూరం కావడంతో కాంగ్రెస్‌కు జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టే వారు పార్టీకి పనికిరావడం లేదని నాయకులు అనుకుంటున్నారు.

బీసీ నేత కోసం వెతుకులాట..

శ్రీధర్ రాజీనామాతో ఖాళీగా ఉన్న డీసీసీ పదవి కోసం కాంగ్రెస్ అధిష్టానం నాయకుల వెతుకులాటలో పడింది. జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్‌లోనే బీసీ నేతలు జిల్లాస్థాయిలో ఉండటంతో ఈసారి బలమైన నాయకుడికి జిల్లా బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. మేడ్చల్‌కు చెందిన నక్క ప్రభాకర్‌గౌడ్, తోటకూర జంగయ్య యాదవ్‌లలో ఇద్దరిలో ఒకరికి డీసీసీ అధ్యక్ష పదవి కేటాయిస్తున్నారని సమాచారం. ఇద్దరు నేతలు మేడ్చల్ టికెట్ ఆశిస్తుండటంతో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవి అప్పగించి ఒకరిని శాంతింపజేయాలని నాయకులు వ్యూహం రచిస్తున్నారు. మొత్తం మీద జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో కొనసాగిన నాయకుడు కాంగ్రెస్ పార్టీకి దూరమవుతుండంతో ఆ పదవి తీసుకోవడానికి నాయకులు వెనుకడుగు వేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

జిల్లాకో వైద్యకళాశాల ఏర్పాటు చేస్తాం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నీలిమా వైద్యకళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి

ఘట్‌కేసర్: వైద్యరంగంలో తెలంగాణ దేశానికే తలమానికమని, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన మేడ్చల్ జిల్లా వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నీలిమా వైద్య కళాశాలను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ఓ ప్రైవేటు యూనివర్సిటీలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. కోవిడ్ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. తెలంగాణ వైద్యకళాశాలల్లోనే ఇతర రాష్ట్రాల విద్యార్థులు వచ్చి చేరుతున్నారని, వచ్చే ఏడాది నుంచి ఏటా 10 వేల మంది వైద్యులు తయారవుతారని, జిల్లాకో వైద్యకళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ నీలిమా సూర్యదేవర, ఉప కులపతి రామచంద్రం, కళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న వనవాసీలు



మాట్లాడుతున్న అఖిల భారత వనవాసీ కల్యాణ్ ఆశ్రమ అధ్యక్షుడు రామచంద్ర ఖరాడి

పోచారం: వనవాసీల్లో భిన్న ఆలోచనలు, సంస్కృతులు ఉన్నా ఐక్యతతో అన్నిరంగాల్లో రాణిస్తున్నట్లు అఖిల భారత వనవాసీ కల్యాణ్ ఆశ్రమ్ అధ్యక్షుడు రామచంద్ర ఖరాడి అన్నారు. అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో వనవాసీల సదస్సు కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ.. ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ చేరుకుందని, అందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం చేయడంలో జార్ఖండ్‌కు చెందిన గిరిజన విద్యార్థి పాల్గొని యావత్ వనవాసీ సముదాయానికి వన్నె తెచ్చారన్నారు. నారీ శక్తి వందన్ చట్టం, గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆశ్రమ్ ఉపాధ్యక్షుడు డా.హెచ్‌కే నాగు, సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.

అభివృద్ధిలో నెంబర్ వన్



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో సుమారు రూ.42 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కు ప్రహరీ గోడ నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వివిధ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలో బీసీబంధు చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్ర కుమార్, కౌన్సిలర్లు లక్ష్మీ, అన్నమరాజు లావణ్యశ్రీనివాస్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, పంగ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో సదస్సు



ప్రొఫెసర్ సుధాకర్, కళాశాల చైర్మన్ గోవింద్‌రెడ్డి

కీసర: ప్రైవేటీకరణతో పెట్టుబడులు పెరిగి కార్పొరేట్ రంగంలో నమ్మకమైన సమాచారం లేకపోవడంతో పెట్టుబడిదారులు, రుణదాతలు నష్టపోతున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ అన్నారు. రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో కళాశాల చైర్మన్ కె.గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సమ్మేళన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి, అకౌంటింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ పీవీ రమణారావు, గౌరవ అతిథి అప్పారావు, కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఫార్మసీ విభాగ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

మేడ్చల్: పట్టణంలోని 23 వార్డులను దశలవారీగా అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 3, 18 వార్డుల్లో కౌన్సిలర్లు దేవరాజు, భవాని రాఘవేందర్‌గౌడ్‌తో కలిసి సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. 3వ వార్డులో రూ.20 లక్షలతో సీసీ, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. 18వ వార్డులో రూ.25 లక్షలతో పనులు చేపట్టినట్లు చెప్పారు. వార్డుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికారెడ్డి

ఎన్నికలకు యంత్రాంగం సమాయత్తం

- షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా.. ప్రక్రియ సాఫీగా..
- పోలింగ్ సిబ్బంది, కేంద్రాలు, అంతా సిద్ధం
- మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 26.91 లక్షలు
- పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,397



కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఓటరు నమోదు, ఓటు వినియోగంపై ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మిగతా కార్యాచరణపై దృష్టి సారించారు.

నోడల్ అధికారుల నియామకం

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ప్రవర్తన నియమావళి (కోడ్ ఆఫ్ కండక్ట్) సహా ఇతర అంశాలను పక్కాగా అమలు చేయాల్సి ఉంటుంది. ఈవీఎంల మేనేజ్‌మెంట్, శాంతిభద్రతలు, సిబ్బంది బ్యాలెట్, కమ్యూనికేషన్ ప్రణాళిక నియామకం, శిక్షణ, సామాగ్రి నిర్వహణ, రవాణా, సైబర్ సెక్యూరిటీ వ్యయ పరిశీలన, పోస్టల్ బ్యాలెట్, ఓటరు సహాయక కేంద్రం, పరిశీలకుల మేనేజ్‌మెంట్, సమన్వయం తదితరాలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నోడల్ అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్ నియమించారు. మేడ్చల్ జిల్లాలో 2,397 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మేడ్చల్‌లో 580, మల్కాజిగిరిలో 411, కుత్బుల్లాపూర్‌లో 582, కూకట్‌పల్లిలో 417, ఉప్పల్‌లో 402 పోలింగ్ కేంద్రాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించారు.

రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా జిల్లాలో పోలీసు శాఖలు సన్నద్ధమవుతున్నాయి. కోడ్ కూయకముందే శాఖాపరంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా అనుసరించాల్సిన విధానాలపై కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా పోలీసు శాఖ ప్రత్యేకంగా నిఘా పెడుతోంది. సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసింది. నియోజకవర్గాల వారిగా కమిషనరేట్ పరిధిలో ఏసీపీలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు.

మేడ్చల్ జిల్లాలో ఓటర్లు 26.91 లక్షలు

జిల్లాలో ఐదు సెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 26,91,167 మంది ఓటర్లు ఉన్నారని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గాల వారిగా మేడ్చల్‌లో 5,95,382 మంది ఓటర్లు ఉండగా, మల్కాజిగిరిలో 4,68,822 మంది, కుత్బుల్లాపూర్‌లో 6,69,253 మంది, కూకట్‌పల్లిలో 4,47,523 మంది, ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,167 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో సర్వీస్ ఓట్లు 729 ఉన్నాయి. 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 32,880 మంది ఉండగా, 18-19 ఏళ్ల వయసున్న వారు 41,715 మంది ఉన్నారు. 20-29 ఏళ్లు ఉన్నవారు 4,43,403 మంది, 30-39 ఏళ్ల వారు 8,05,680 మంది, 40-49 ఏళ్లు ఉన్న ఓటర్లు 6,45,334 మంది, 50-59 ఏళ్లు ఉన్నవారు 3,89,579 మంది, 60-69 ఏళ్లు ఉన్న వారు 2,22,554 మంది, 70-79 ఏళ్లు 1,10,022 మంది ఉన్నారు. ఈ జాబితాను కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచారు. అక్టోబరు 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు లేకుంటే తక్షణమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ ముగింపు నాటికి ఓటర్లుగా నమోదుకావొచ్చని పేర్కొంటున్నారు.

రేపు ప్రజావాణి రద్దు

కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందున సోమవారం జరిగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు దూరప్రాంతాల నుంచి అవస్థలు పడి ప్రజావాణికి తరలిరావొద్దని.. అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

కీసరలో ఎంపీడీఓ గ్యామ పర్యటన

కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేయాలని నిర్వాహకులకు ఎంపీడీఓ గ్యామ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కీసరలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్ మాధురివెంకటేష్, గ్రామకార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన సాంకేతికత అభ్యసించాలి



నల్లా నర్సింహారెడ్డి కళాశాలలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి పార్థసారథి

ఘట్‌కేసర్: విద్యార్థులు నూతన సాంకేతికతను అభ్యసించాలని హైదరాబాద్ బిట్స్ బిలానీ ప్రొఫెసర్ పార్థసారథి, ఐబీఎం ప్రతినిధి శ్రీకాంత్ అన్నారు. చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2023కు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సీవీ కష్టారెడ్డి మాట్లాడుతూ హ్యాకథాన్‌లో పాల్గొనడం ద్వారా వ్యక్తిగత నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ రామేశ్వరీ, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



శామీర్‌పేట్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ జాం రవి అన్నారు. మూడుచింతలపల్లిలో పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ప్రజాసమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని గ్రామసర్పంచ్ జాం రవి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ బంధు చెక్కుల అందజేత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన 20 మంది బీసీబంధు లబ్ధిదారులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి చెక్కులు అందజేశారు. మంత్రి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

